క్లుప్తంగా

ఇరుకు వంతెనతో ఇక్కట్లు



ప్రమాదకరంగా ఉన్న వంతెన

కె.గంగవరం: అసలే ఏటిగట్టు ఇరుకు. దీనిపై కోట వద్ద ఉన్న వంతెన మరీ ఇరుకు. దీనికి తోడు వంతెనకు ఇరువైపులా ప్రమాదకర మలుపులతో ఏటిగట్టు రోడ్డు ప్రమాదకరంగా మారిందని ప్రయాణికులు అంటున్నారు. మండలంలోని కోటిపల్లి–కోట ఏటిగట్టుపై ఉన్న ఈ వంతెన వద్ద గత రెండు నెలలుగా పలువురు తీవ్రంగా గాయపడి ఆసుపత్రి పాలయ్యారని స్థానికులు చెబుతున్నారు. కనీసం ఈ వంతెన వద్ద ఆర్అండ్బీ అధికారులు హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయలేదని ప్రయాణికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఆర్అండ్బీ అధికారులు స్పందించి వంతెనకు ఇరువైపులా స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయడంతో పాటు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేసిన సర్పంచ్ గోవిందు తదితరులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని తాళ్లపొలంలో ఎంపీపీ ప్రాథమికోన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు మంగళవారం ట్యాబ్‌లను పంపిణీ చేశారు. సర్పంచ్ కట్టా గోవిందు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఈ కార్యక్రమంలో 22 మంది విద్యార్థులకు ఈ ట్యాబ్‌లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ మెరుగైన విద్యను అందించేందుకు ప్రభుత్వం సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తీసుకువస్తుందని, ఈ ట్యాబ్‌లను ప్రతి విద్యార్థి సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. వైస్ సర్పంచ్ వల్లు శివ, ఎంపీటీసీ పంపన ఏడుకొండలు, విద్యా కమిటీ చైర్మన్ మేడిశెట్టి రవికుమార్, వైస్ చైర్మన్ ఎస్.వరలక్ష్మి, హెచ్ఎం బి.లక్ష్మణరావు, తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఆఫీసులో హ్యాండ్ వాష్ స్టేషన్



మండపేట మున్సిపల్ కార్యాలయం వద్ద హ్యాండ్ వాష్ చేస్తున్న చైర్ పర్సన్ తదితరులు

కపిలేశ్వరపురం (మండపేట): ఆరోగ్యరీత్యా చేతుల పరిశుభ్రత ప్రాధాన్యతను ప్రతి ఒక్కరూ గుర్తించాలని మండపేట మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి అన్నారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా), యునిసెఫ్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో హ్యాండ్‌వాష్ స్టేషన్‌ను ప్రారంభించారు. తరచూ చేతులను శుభ్రం చేసుకోవడం ద్వారా వ్యక్తిగత ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. హ్యాండ్‌వాష్ స్టేషన్‌ను సద్వినియోగం చేసుకునేలా పట్టణ ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈఈ కె.శ్రీనివాసు, ఏఈలు సత్యనారాయణ, పవన్, మెప్మా టీఎంసీ అనంతలక్ష్మి, సీఓ రమాదేవి, ఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

రామాలయం.. మరపురాని సువర్ణాధ్యాయం

ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి



అయోధ్య రామాలయాన్ని సందర్శిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి దంపతులు, డాక్టర్ తేతలి దశరథ రామారెడ్డి దంపతులు

అనపర్తి: అయోధ్యలో రామాలయ నిర్మాణం మరపురాని సువర్ణాధ్యాయమని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అన్నారు. అయోధ్య రామాలయంలో బాలరాముని విగ్రహ ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకుని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి, ఆదిలక్ష్మి దంపతులు అయోధ్యను సందర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బాలరాముని విగ్రహ ప్రతిష్ఠాపన మహత్తర ఘట్టమని, ఈ సమయంలో అయోధ్యను సందర్శించి స్వామి విగ్రహాన్ని దర్శించుకోవడం మరపురాని అనుభూతి అన్నారు. విగ్రహ ప్రతిష్ఠాపన అనంతరం స్వామివారి దివ్యమంగళ రూపాన్ని అతి సమీపం నుంచి చూసి, తమ జీవితాలు ధన్యమయ్యాయని ఎమ్మెల్యే దంపతులు పేర్కొన్నారు. ఈ అయోధ్య యాత్రలో హైదరాబాద్ యశోద హాస్పిటల్ ఆర్థోపెడిక్ చీఫ్ సర్జన్ డాక్టర్ తేతలి దశరథరామారెడ్డి, సింధు దంపతులు పాల్గొన్నారు.

సిరుల తల్లి.. కల్పవల్లి

- వైభవంగా రాయవరం పోలమాంబ జాతర
- వేలాదిగా తరలి వచ్చిన భక్తులు



భక్తజన సందోహంతో కిటకిటలాడుతున్న జాతర

రాయవరం: రజిత వజ్ర కిరీట ధారియై..నిత్య పూజలందుకుంటున్న స్థానిక పోలమ్మ వారు సిరుల తల్లిగా దర్శనమిచ్చారు. వార్షికోత్సవం సందర్భంగా అమ్మవారిని గజమాలలు, ఆభరణాలతో నయనానందకరంగా అలంకరించారు. అమ్మవారి జాతరను మంగళవారం వైభవంగా నిర్వహించారు. శతాబ్దాలుగా నిత్య పూజలు అందుకుంటున్న అమ్మవారికి కొప్పు వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జాతర నిర్వహించారు. వేకువజాము నుంచే భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు క్యూ కట్టారు. కోరిన కోర్కెలు నెరవేరాలని, పాడి పంటలు, పిల్లాపాపలను చల్లంగా చూడాలని కోరుతూ మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి ఆరు గంటల నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు ఆలయానికి పోటెత్తారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల భక్తులతో పాటుగా పశ్చిమ, విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో జాతరకు తరలి వచ్చారు. కొప్పు వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షుడు నౌడు వెంకటరమణ ఆధ్వర్యంలో జాతర ఘనంగా నిర్వహించారు. రామచంద్రపురం డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్ ఆధ్వర్యంలో మండపేట రూరల్ సీఐ కొమ్ముల శ్రీధర్‌కుమార్ పర్యవేక్షణలో రాయవరం ఎస్సై జి.నరేష్, మండపేట టౌన్ అప్పారావు, మండపేట రూరల్ ఎస్సై బి.శివకృష్ణ, అంగర ఎస్సై చంటి, ద్రాక్షారామ ఎస్సై భుజంగరావులు, 110 మంది సిబ్బందితో భారీ బందోబస్తు నిర్వహించారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, ఎంపీపీ నౌడు వెంకటరమణ, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ తేతల సుబ్బరామారెడ్డి, పారిశ్రామికవేత్త కొవ్వూరి సత్యనారాయణరెడ్డి (సత్తిబాబు), మాజీ ఎంపీపీ సిరిపురపు శ్రీనివాసరావు, పలువురు ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నేతలు, అమ్మవారిని దర్శించుకున్నారు.

అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

అమ్మవారి జాతరను పురస్కరించుకుని ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. తీన్ మార్, బ్యాండుమేళాలు, గరగ నృత్యాలు, కోబ్రా డ్యాన్సు, సంగీత విభావరి వంటి సాంస్కృతిక ప్రదర్శనలు భక్తులను అలరించాయి. డైనో సార్, ఎలుగుబంటి, శక్తి వేషాలు, భారీ స్థాయిలో ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలంకరణ, మిరుమిట్లు గొలిపే బాణసంచా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



రజత కిరీట ధారియై.. గజమాలలతో పోలమ్మ వారు

విద్యార్థులకు క్రీడలపై ఆసక్తి పెంపొందించాలి



కాజులూరులో మండల స్థాయి విజేతలకు బహుమతులు అందజేస్తున్న అధికారులు, నాయకులు

కాజులూరు: విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలపై ఆసక్తిని పెంపొందించాలని ఎంపీపీ మాత భారతి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ఆడుదాం ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా గత నెల 24వ తేదీ నుంచి నిర్వహించిన గ్రామీణ స్థాయి ఆటల పోటీల్లో 250 మంది క్రీడాకారులు మండల స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అధికారులు గత 10 రోజులుగా గొల్లపాలెంలో క్రికెట్ తదితర ఆటలకు, కాజులూరులో వాలీబాల్, కబడ్డీ తదితర ఆటలకు మండల స్థాయి పోటీలు నిర్వహించారు. మంగళవారం పోటీలు ముగియటంతో ఎంపీపీ మాత భారతి, జెడ్పీటీసీ వనుం వెంకటసుబ్బారావు తదితరులు విజేతలకు బహుమతులు అందజేశారు. ఎంపీడీఓ రత్నంరాజు మాట్లాడుతూ మండల స్థాయి విజేతలు ఈనెల 24 నుంచి రామచంద్రపురంలో జరిగే నియోజకవర్గస్థాయి ఆటల పోటీల్లో పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ సీహెచ్ ఇందిరాదేవి, సర్పంచ్ దండంగి సరోజని, కాజులూరు పీడీ జీజేఆర్ఎస్ కౌర్, గొల్లపాలెం పీడీ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

'జగనన్న ఆరోగ్య సురక్ష'తో పేదలకు మేలు



ఉండూరు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యాధికారులు



మంజేరులో రోగులకు మందుల కిట్ అందజేస్తున్న నాయకులు, వైద్యులు



పడమర ఖండ్రికలో వైద్యసేవలు అందిస్తున్న వైద్యులు

కపిలేశ్వరపురం: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలతో పేద, మధ్య తరగతి ప్రజలకు మేలు కలుగుతుందని అంగర పీహెచ్‌సీ వైద్యాధికారి పీఎస్ఎస్‌డీ రత్నకుమారి అన్నారు. ఆ పీహెచ్‌సీ పరిధిలోని పడమర ఖండ్రిక సచివాలయంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని సర్పంచ్ తురునాతి ఆదిలక్ష్మి ప్రారంభించగా జనరల్ సర్జన్ జి. శ్రావణి, జనరల్ మెడిసిన్ ఎస్.అభిలాష్, పీఎంఓ ఎస్.సత్యనారాయణ, డాక్టర్ పీఎస్ఎస్‌డీ రత్నకుమారి 321 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. ఈసీజీ, రక్త పరీక్షలను చేసి, అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. 14 మందికి వైఎస్సార్ కంటి వెలుగు ద్వారా మంజూరైన కళ్ల జోళ్లను అందజేశారు. వైద్య ఆరోగ్య, సచివాలయ సిబ్బంది, ఆశ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కాజులూరులో..

కాజులూరు: పేద, మధ్య తరగతి ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అందించటంతో పాటు వారి ఆరోగ్య పరిరక్షణకు పథకాన్ని రూపొందించి రాష్ట్రాన్ని సంపూర్ణ ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దాలన్నదే సీఎం జగనన్న లక్ష్యమని వైఎస్సార్ సీపీ మండల ఎస్సీ సెల్ నాయకుడు, మంజేరు సర్పంచ్ గుంటూరి అప్పారావు అన్నారు. మంగళవారం మంజేరులో అధికారులు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. గొల్లపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారులు ఎస్.సౌజన్య ఆధ్వర్యంలో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి చెందిన పలువురు నిపుణులైన వైద్యులు పాల్గొని సుమారు 368 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలు చిన్న, చిన్న అనారోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేస్తూ క్రమేపీ దీర్ఘకాలిక సమస్యల బారిన పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమం ద్వారా నిపుణులైన వైద్యులతో ప్రజలందరికీ వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి తగు చికిత్స అందించడంతో పాటు ప్రజలకు ఆరోగ్య నియమాలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సచివాలయాల సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం

రామచంద్రపురం రూరల్: ఉండూరులో జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరంలో మొత్తం 310 మందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించగా వివిధ పరీక్షల నిమిత్తం 112 మందికి 281 ల్యాబ్ టెస్టులు చేసినట్లు వైద్యాధికారి ఎస్.ప్రశాంతి తెలిపారు. వివిధ విభాగాలకు చెందిన వైద్యులు పాల్గొని పరీక్షలు చేశారు.

గ్రామాల్లో బోస్ పర్యటన



ఊడిమూడిలో గ్రామ పెద్దలతో మాట్లాడుతున్న బోస్

కె.గంగవరం: మండలంలోని సత్యవాడ, తామరపల్లి, ఊడిమూడి, కోట గ్రామాల్లో మంగళవారం రాజ్యసభ సభ్యుడు పిల్లి సుబాష్‌చంద్రబోస్ పర్యటించారు. ఆయా గ్రామాల్లోని పలు సంఘాలకు చెందిన గ్రామ పెద్దలను మర్యాదపూర్వకంగా కలిశారు. రానున్న ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి మద్దతు తెలపాలని, రామచంద్రపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పిల్లి సూర్యప్రకాష్ పోటీ చేస్తున్నారని ఆయనకు కూడా తమ మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు. పలు గ్రామాల్లో పెద్దలు రాజ్యసభ సభ్యుడు బోస్‌ను శాలువాలు, పూలదండలతో ఘనంగా సత్కరించారు. పార్టీ రాజానగరం పరిశీలకుడు వట్టికూటి సూర్యచంద్రరాజశేఖర్, మార్కెట్ కమిటీ అధ్యక్షుడు పండు గోవిందరాజు, పార్టీ మండల అధ్యక్షుడు పెట్టా శ్రీనివాస్, పార్టీ ఉపాధ్యక్షుడు సలాది అర్జునరావు, సొసైటీ అధ్యక్షులు సాదా వెంగళరావు, యువజన నాయకులు జుత్తుక శ్యాంప్రసాద్, జిల్లా వ్యవసాయ సలహా కమిటీ సభ్యులు బత్తుల అప్పారావు, నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వీరుల త్యాగాలను స్మరించుకోవాలి



సుభాష్ చంద్రబోస్‌కు నివాళి అర్పిస్తున్న అధ్యాపకులు



మండపేటలో బోస్‌కు నివాళి అర్పిస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి, పృథ్వీరాజ్

కపిలేశ్వరపురం (మండపేట): నేతాజీ సుభాష్ చంద్రబోస్ వంటి వీరుల త్యాగాలను అందరూ స్మరించుకోవాలని మండపేట మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, వైఎస్సార్ సీపీ యువనేత తోట పృథ్వీరాజ్ అన్నారు. 15వ వార్డు ధర్మగుండం చెరువు వద్ద నేతాజీ సుభాష్ చంద్రబోస్ యువజన సంఘం ఆధ్వర్యంలో బోస్ 128వ జయంతిని మంగళవారం నిర్వహించారు. సంఘం నాయకులు బళ్లా నాగు మాట్లాడుతూ యువత నేతాజీని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. చైర్‌పర్సన్ దుర్గారాణి, పృథ్వీరాజ్ మాట్లాడుతూ సమాజ ప్రగతికి మహనీయుల త్యాగాలు దోహద పడ్డాయన్నారు. వారి అడుగుజాడల్లో నడుస్తూ భవిష్యత్తు తరాల అభ్యున్నతికి పాటుపడాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పరాక్రమ్ దివస్

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్ర, రాజనీతి శాస్త్రం విభాగాల ఆధ్వర్యంలో మంగళవారం పరాక్రమ్ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ఇంగ్లిష్ అధ్యాపకులు సీహెచ్ త్రినాథ్, బి.సురేష్ కుమార్, డాక్టర్ నెహ్రూ నాయక్ మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమ లక్ష్య సాధన కోసం ప్రాణ త్యాగం చేసిన సుభాష్ చంద్రబోస్, భగత్‌సింగ్ లాంటి వీరుల జీవిత చరిత్రలను విద్యార్థులు అధ్యయనం చేయాలన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలకు అండగా ప్రభుత్వం



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న చైర్‌పర్సన్ శ్రీదేవి తదితరులు

రామచంద్రపురం: మహిళలు బాగుంటేనే రాష్ట్రం అన్ని రంగాల్లో ముందడుగు వేస్తుందని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మహిళా సాధికారతకు పెద్దపీట వేశారని మున్సిపల్ చైర్ పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి అన్నారు. నాలుగో విడత ఆసరా కార్యక్రమం మున్సిపాలిటీ పరిధిలోని 12వ సచివాలయం వద్ద మంగళవారం మెప్మా ఆధ్వర్యంలో మహిళలతో కలిసి సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కమిషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ శ్రీదేవి మాట్లాడుతూ 56 నెలల పాలనలో రాష్ట్రంలో 79 లక్షల మంది డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు వైఎస్సార్ ఆసరా కింద రూ.25,571 కోట్ల రుణాలను సీఎం జగన్ తిరిగి చెల్లించారన్నారు. సంక్షేమ పథకాల అమలులో లంచాలు, వివక్షకు తావులేకుండా పక్కాగా అమలు చేస్తున్న ప్రభుత్వం వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనన్నారు. దేశ చరిత్రలో కానీ, మహిళా చరిత్రలో కానీ, మహిళా సాధికారతకు ఇంత బాధ్యతగా మమకారం ఆసరా పథకం కింద రూ.కోట్లను మహిళలకు సీఎం జగన్ ఇచ్చారన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ కె.శివాజీ, కౌన్సిలర్ వాడ్రేవు సాయి ప్రసాద్, మెప్మా టీఎంసీ ఒ.మంగాదేవి, సీఓలు, ఆర్‌పీలు పాల్గొన్నారు.

ఉండూరులో వికసిత భారత్ సంకల్పయాత్ర

రామచంద్రపురం రూరల్: మండలంలోని ఉండూరు, భీమక్రోసుపాలెం గ్రామాల్లో మంగళవారం వికసిత భారత్ సంకల్పయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కన్వీనర్ కర్రి చిట్టి బాబు, మండల బీజేపీ సభ్యుడు ఓం ప్రకాశ్, మండల బీజేపీ కన్వీనర్ కృష్ణ, అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ దూడల శంకర్‌నారాయణ, మండల సెక్రటరీ వి.ధనరాజ్, ఉండూరు సర్పంచ్ సీహెచ్ రామలక్ష్మి, వైస్ సర్పంచ్ రజనీకుమార్, ఎంపీటీసీ ఇంత కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు. కర్రి చిట్టిబాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 21 పథకాలను వివరించారు. అనంతరం క్యాలండర్ ఆవిష్కరించారు. వైద్యాధికారి ఎస్.ప్రశాంతి, వైద్య సిబ్బంది, సెక్రటరీ సుందర్‌లాల్, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

మిగులు బడ్జెట్ రూ.27,500



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మట్టపర్తి నాగ విజయలక్ష్మి

అయినవిల్లి: మండల బడ్జెట్ సమావేశం మంగళవారం ఎంపీపీ మట్టపర్తి నాగవిజయలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో అన్ని పద్దులు కలిపి ఆదాయం 2024–25 సంవత్సరానికి గాను రూ.68,054,7000 కాగా ఇదే సంవత్సరానికి రూ.68,051,9500 అన్ని పద్దులు వ్యయంగా చూపించారు. మిగులు బడ్జెట్ రూ.27,500 చూపించారు. ఈ బడ్జెట్‌ను ఆమోదిస్తూ సభ్యులు తమ అంగీకారాన్ని తెలిపారు. అనంతరం సమావేశంలో వివిధ శాఖలతో సమీక్ష నిర్వహించారు. మండల సర్వసభ్య సమావేశానికి శాఖ పరమైన బాధ్యతలు తీసుకున్న ఉన్నత అధికారులు కాకుండా దిగువ స్థాయి అధికారులను పంపించడంపై సమావేశంలో ప్రజాప్రతినిధులు ప్రశ్నించారు. దీని వల్ల శాఖా పరమైన అభివృద్ధి తమకు తెలియక పోవడమే కాకుండా శాఖా పరమైన సమస్యల పరిష్కారం జరగడం లేదని ఆరోపించారు. మండల సర్వసభ్య సమావేశం మూడు నెలలకోసారి జరిగే సమావేశమని ఈ సమావేశానికి శాఖపరంగా ఆ శాఖకు సంబంధించి మండల స్థాయి, డివిజన్ స్థాయి అధికారులు తప్పని సరిగా హాజరై తాము గ్రామాల్లో ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారమయ్యేలా చేయాలని కోరారు. అలా కాకుండా సమావేశాలకు హాజరు కాని అధికారులపై చర్యలు తీసుకోవాలని మండల సమావేశంలోని అధికారులను డిమాండ్ చేశారు. ఇకపై అలా జరక్కుండా చూడాలన్నారు. వ్యవసాయశాఖ, ఇరిగేషన్, ఆర్అండ్‌బీ తదితర శాఖలపై సమీక్షించారు. నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతిని చేసి ఆయనకు నివాళులర్పించి ఆయన సేవలను కొనియాడారు. సమావేశంలో ఎంపీడీఓ తాడి శ్రీవెంకటాచార్య, జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, ఎంపీడీవో కె.సత్యనారాయణ, ఈఓపీఆర్డీ మోహన్‌కృష్ణ, డీటీ అశోక్‌కుమార్, సూపరింటెండెంట్ దీక్షుతులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణపై అవగాహన అవసరం



మండపేటలో మాట్లాడుతున్న మదన్‌మోహన్‌రావు

కపిలేశ్వరపురం (మండపేట): రానున్న సార్వత్రి ఎన్నికల నిర్వహణపై ప్రతి అధికారికీ, రాజకీయ పార్టీల ప్రతినిధులకు అవగాహన అవసరమని మండపేట నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి వి.మదన్ మోహన్‌రావు అన్నారు. మండపేట తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈనెల 22న ఫొటో ఓటర్ల జాబితాను ప్రకటించామన్నారు. ఈ నెల 25న జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించనున్నట్టు తెలిపారు. పట్టణంలోని మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో నిర్వహించిన ఈ సమావేశంలో నియోజకవర్గంలోని సెక్టార్ అధికార్లు, పోలీస్ సెక్టార్ అధికారులు, పోలింగ్ స్టేషన్ల డిపార్ట్‌మెంట్ అధికారులతో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు.

రామనామ సంకీర్తనకర్త శేఖర్‌కు ఘనసన్మానం



శేఖర్‌ను సత్కరిస్తున్న సత్యసాయి సేవా సమితి సభ్యులు

కొత్తపేట: గ్రామాల్లో శ్రీరామనామ సంకీర్తన ద్వారా హిందూమత ప్రచారం చేస్తున్న ధర్నాల శేఖర్‌ను పలు ధార్మిక సేవా సంస్థలు ఘనంగా సత్కరించాయి. కొత్తపేట మండలం వానపల్లి గ్రామానికి చెందిన శేఖర్ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. శ్రీరాముని భక్తుడైన శేఖర్ గత కొన్నేళ్లుగా తన ఆటో ద్వారా శ్రీరామనామ సంకీర్తన ప్రచారం చేస్తున్నారు. తన ఆటోకు శ్రీరాముని చిత్రంతో కాషాయ పతాకాలను అలంకరించి, మైకు తగిలించి తెల్లవారుజామునే పురవీధుల్లో తిరుగుతూ రామనామ సంకీర్తనల ద్వారా ప్రజలను మేల్కొలుపుతున్నారు. తరువాత 8 గంటల అనంతరం తన జీవనాధారమైన ఆటో సర్వీసు చేసుకుంటారు. ఈ విధంగా ఆయన హిందూమత ప్రచారం చేస్తూ, దైవ సేవలో తరిస్తూ భక్తుల అభిమానాన్ని చూరగొన్నారు. ఈ నేపథ్యంలో స్థానిక సత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో స్థానిక సత్యసాయిబాబా మందిరంలో సోమవారం రాత్రి సన్మానం నిర్వహించారు. సంస్థ కన్వీనర్ కంకటాల సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన శేఖర్ సన్మానంలో వ్యాపారవేత్త సంభూరి రెడ్డియ్య ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అనంతరం శేఖర్‌ను శాలువా, పూలమాలలు, నూతన వస్త్రాలతో సత్కరించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు సుతాపల్లి లక్ష్మీనారాయణ, కొత్తమాసు సాంబశివరావు, చొప్పెల్ల రాంబాబు, సత్యవరపు భాస్కరరావు, మారిశెట్టి సత్యనారాయణ, చింతం రామకృష్ణ, కోట్ల విజయసారథి, బ్రహ్మరాజు తదితరుల ఆధ్వర్యంలో శేఖర్‌ను ఘనంగా సత్కరించారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లో రాగితీగ చోరీ

రంగంపేట: వ్యవసాయ బోరుకు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగితీగ చోరీ అయినట్టు బాధితుడు పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశాడు. బాధితుడి కథనం ప్రకారం.. నల్లమిల్లి గ్రామానికి చెందిన నెల్లి అర్జునకు గ్రామంలో ఐదు ఎకరాల మెట్ట పొలం ఉంది. సాగునీటి కోసం బోర్ వేయించి, ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. సోమవారం రాత్రి ట్రాన్స్‌ఫార్మర్‌ను పగులగొట్టి, దొంగలు రాగితీగను పట్టుకుపోయారు. ఈ మేరకు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి అభిషేకాలు

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలులో కొలువైన కుమార సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి భారీగా అభిషేకాలు నిర్వహించారు. మంగళవారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి, ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని, స్వామివారిని దర్శించుకున్నారు.

ప్రజలకు సమాధానం చెప్పాలి

- వైఎస్సార్ సీపీ దళిత నాయకుల విమర్శ



మండపేటలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ దళిత నాయకులు

కపిలేశ్వరపురం (మండపేట): వైఎస్సార్ సీపీ గుర్తుపై గెలిచిన మండపేట పురపాలక సంఘం 11వ వార్డు కౌన్సిలర్ కొవ్వాడ బేబి, అప్పన్నబాబు దంపతులు పార్టీ మారడంపై ప్రజలకు సమాధానం చెప్పాలని పట్టణానికి చెందిన వైఎస్సార్ సీపీ దళిత నాయకులు అన్నారు. పట్టణంలోని ఆ పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆ పార్టీకి చెందిన 8వ వార్డు కౌన్సిలర్ మందపల్లి రవి కుమార్, నాయకులు ఎస్. ధనరాజ్, పాలంకి కమల, కోనాల చంద్రబోస్, మందపల్లి సుధాకర్ తదితరులు మాట్లాడుతూ బేబి, అప్పన్నబాబు దంపతులు ఇటీవల టీడీపీలో చేరడాన్ని తప్పుబట్టారు. కౌన్సిలర్ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ మారుతూ పట్టణంలో అభివృద్ధి, సంక్షేమం జరగడం లేదంటూ వ్యాఖ్యానించడం సరైంది కాదన్నారు. సంక్షేమానికి మారుపేరు వైఎస్సార్ సీపీ ప్రభుత్వమన్నది పట్టణ ప్రజలకు తెలుసు అన్నారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పట్టణంలోని ప్రతి వార్డుకూ సంక్షేమాన్ని అందిస్తున్న తీరును పట్టణ ప్రజలు ప్రశంసిస్తున్న సంగతిని గుర్తెరిగి మాట్లాడాలని హితవు పలికారు.

నరేంద్రపురంలో స్కిల్ హబ్ ప్రారంభం



నరేంద్రపురం గురుకుల పాఠశాలలో ప్రారంభించిన స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం సెంటర్

పి.గన్నవరం: మండలంలోని నరేంద్రపురం గురుకుల పాఠశాలలో స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ద్వారా అందిస్తున్న ఉచిత శిక్షణ కార్యక్రమాలను నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి పి.లోకమాన్ విజ్ఞప్తి చేశారు. గురుకుల పాఠశాలలో మంగళవారం ఏపీ నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్కిల్ హబ్‌ను ప్రారంభించారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉచిత శిక్షణ పొందిన అనంతరం ఉపాధి అవకాశాలు ఉంటాయన్నారు. డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సులో 30 మందికి శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నుంచి ప్రారంభించినట్టు ఆయన వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ బీర వెంకమాంబ, ఎంపీటీసీ కొక్కిరి వెంకటలక్ష్మి, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ పి.వేణు, వైస్ ప్రిన్సిపాల్ ఎ.శాస్త్రి, ఏడీఎస్‌డీఓ ఒ.నాగబాబు, స్కిల్ ప్రోగ్రాం ట్రైనర్ కె.రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.